

శ్రీ సత్యసాయి

మెరుగైన వైద్యసేవలు అందించాలి : రఘువీరా

ప్రజాశక్తి-మడకశిర



ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న రఘువీరారెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు కృషి చేయాలని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి సూచించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా జమ్మలబండ గ్రామానికి చెందిన గురుదత్త కుమారుడు ఏర్పాటు చేసిన నూతన దంత చికిత్స కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్ రెడ్డి, పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, హనుమంత రెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలుద్దాం

- ◆ నిజాయితీగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు
- ◆ ప్రజలకు ఎళ్లవేళలా అండగా నిలవాలి
- ◆ అనంతలో ప్రొబెషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్



శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి అందిస్తున్న హోంశాఖ మంత్రి వనిత, డిజి రాజేంద్రనాథ్‌రెడ్డి (పక్క చిత్రంలో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి)





ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమాజంలో పోలీసులకు ఎంతో గుర్తింపు ఉందని, అలాంటి రంగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలకు అండగా నిలవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనతి తెలియజేశారు. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 28 మంది ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను సోమవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత, డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో డీఎస్పీల విధులు అత్యంత కీలకమైనవని చెప్పారు. ఒక వైపు ఉన్నతాధికారుల నిర్ణయాలను అమలు చేస్తూ, మరో వైపు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చేత సమర్థవంతంగా పనిచేయించాల్సిన బాధ్యత డీఎస్పీలపైన ఉంటుందన్నారు. పోలీసు విధుల్లోకి వెళ్తున్న వారంతా నిజాయితీగా, సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. డీఎస్పీ అంటే డికేటెడ్ సక్సెస్ ఫుల్ పోలీస్‌గా, డైనమిక్ అండ్ సెన్సిబుల్ పోలీస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశంలో పోలీస్ శాఖ పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సమూలమైన మార్పులతో నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు మంచి సేవలందించాలన్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ పోలీస్ స్టేషన్లు, దిశ యాప్, ప్రత్యేక కోర్టులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై నమోదైన కేసుల్లో 93.7 శాతం వారం రోజుల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితులకు న్యాయ స్థానంలో శిక్షలు విధించడంతో భాదితులకు సత్వర న్యాయం లభించిందని తెలిపారు.

ప్రజలకు మేలు చేసేలా విధులు నిర్వహించాలి : డిజిపి

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీలు ప్రజలు మేలు చేసేలా విధులు నిర్వహించాలని డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. అన్ని వర్గాలు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి అందర్నీ సమన్వయ పరుచుకుని చట్టపరంగా ముందుకు సాగాలన్నారు. పోలీసు ప్రవర్తన సరిగా లేకపోతే ప్రభుత్వం, పోలీసుశాఖ, కుటుంబాలకు చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తించుకోవాలన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా సాఫీగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. న్యాయం కోరి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూడాలన్నారు. మహిళల సమస్యలపై మరింత చొరవచూపి వారికి అండగా నిలవాలన్నారు. సోషల్ మీడియా పోకడలను నియంత్రించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దష్టిపెట్టామన్నారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనపరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోంశాఖా మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్, ఐజిపి వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎస్పీలు కేకేఎన్.అన్బురాజన్, ఎస్‌వి.మాధవరెడ్డి, తాడిపత్రి బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీంతో పాటు ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పండుగ రోజూ పోరాటం

- ◆ ఇళ్ల పట్టాల కోసం ఆగని పేదల ఆందోళన
- ◆ గుడిసెల్లోనే దసరా పండుగ
- ◆ భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా వేడుకలు
- ◆ చిలమత్తూరులో కొనసాగుతున్న పేదల భూపోరాటం



భూ స్వాధీన స్థలం వద్ద సహపంక్తి భోజనాలు చేస్తున్న హిందూ,ముస్లిం, క్రిస్టియన్లు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇళ్ల పట్టాల కోసం చిలమత్తూరులో పేదలు చేస్తున్న భూ పోరాటం నిర్విరామంగా కొనసాగుతోంది. పండుగ రోజు కూడా ఆందోళనను ఆపకుండా భూ స్వాధీన స్థలంలోనే నిరసన చేపట్టారు. ఓ వైపు పండుగ, మరోవైపు పోరాటాన్ని కలిపి ఆందోళన నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు దసరా పండగును వారు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే సోమవారం జరుపుకున్నారు. అక్కడే వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులతో కలిసి ఆటపాటలు, నృత్యాలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఇళ్ల స్థలాల కోసం కోడూరు పొలం సర్వేనెంబర్ 805లో గత 40 రోజులుగా పేదలు భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పోరాటాన్ని కొనసాగిస్తూ జగనన్న లేఅవుట్‌లో వేసుకున్న గుడిసెల్లోనే పేదలు దసరా పండుగ సంబరాలు చేసుకున్నారు. గుడిసెల ముందు ముగ్గులు వేసి తోరనాలు కట్టారు. తొలుత లేఅవుట్‌లో సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలమత్తూరులో ఇళ్ల స్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాటం జిల్లాకే ఆదర్శం అన్నారు. విజయదశమి అంటే రాక్షసులపై ప్రజల విజయమని, అలాంటి రోజున పోరాట స్ఫూర్తితో ఎర్రజెండాను ఎగరవేయడం అభినందనీయం అన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా వనభోజనాలు

భారతీయ సంస్కృతి సంప్రదాయం భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా హిందూ ముస్లిం సోదరలు కులమతాలకు అతీతంగా అందరూ కలిసి భూస్వాధీన స్థలంలోనే వంటకాలు చేసుకుని, సహపంత్తి భోజనాలు చేశారు. న్యాయమైన పోరాటానికి కులమతాలు అడ్డురావని, అందరూ ఐక్యం ఉంటే ఎలాంటి లక్ష్యాన్ని సాధించవచ్చేని సంకేతాన్ని వారు అందించారు. పేదలు చేస్తున్న ఈ పోరాటం చాలా మందిని కదలించింది. మండలంలోనే పలు గ్రామాల ప్రజలు వారి వద్దకొచ్చి మద్దతు తెలిపారు. ఇక చిన్నారులు చేసిన నృత్యాలు అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సమిష్టిజీవనం... సమిష్టి కృషితో ఇళ్ల పట్టాలు సాధిస్తాం
ఇళ్ల స్థలాల సాధన కమిటీ కార్యదర్శి చందు

సిమిష్టి జీవనం.. సమిష్టి కృషితో ఇళ్ల పట్టాలను సాధించేలా పోరాటం కొనసాగిస్తామని ఇళ్ల స్థలాల సాధన సమితి కార్యదర్శి చందు తెలిపారు. 805 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలందరూ కష్టజీవులన్నారు. గుడిసెల కేంద్రంలో పండుగ వాతావరణం ఒట్టిపడేలా ఐక్యమత్యంగా పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. ఈ వేడుకల ద్వారా తమ పోరాట స్ఫూర్తిని ప్రభుత్వం, అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షుడు లక్ష్మినారాయణ, చందు, సదాశివరెడ్డి, రహంతుల్లా, రియాజ్, వేణు, మణి, శివ తదితరులు పాల్గొన్నారు.

వారికి ఫుల్...వీరికి నిల్!

◆ పాలకులు, అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్న మార్కెట్ ◆ నెలకు లక్షల్లో మున్సిపల్ ఆదాయానికి గండి



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ వాణిజ్య సముదాయం



మార్కెట్ టోకు వ్యాపారులు బస్టాండ్ ఆవరణంలో నిర్మాణం చేసిన షెడ్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో వాణిజ్య భవన సముదాయం నిర్మితం అయ్యింది. ఇక్కడ వేలం పాట నిర్వహణ సమయంలో మున్సిపల్ అధికారులు విడుదల చేసిన గెజిట్‌లో చెప్పిన విధంగా సౌకర్యాలు కల్పించక పోవడంతో ఏడాదిగా వాణిజ్య సముదాయం నిరుపయోగంగా ఉంది. దీంతో పురపాలక సంఘానికి నెలకు లక్షల్లో వచ్చే ఆదాయానికి గండి కొడుతోంది. అదే మార్కెట్ వ్యాపారులు, పాలకులు, అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిస్తుండడం విశేషం. ఇక్కడే ఆకుకూరల వ్యాపారం చేసుకునే వారికి నాలుగు అడుగుల స్థలాన్ని కేటాయించాలంటే గుడ్‌విల్ తీసుకుని వారికి నెలకు అద్దె నిర్ణయించి లాటరీ విధానం ద్వారా స్థలాన్ని కేటాయించారు. మార్కెట్, వాణిజ్య సముదాయ భవనాల గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఎటువంటి అనుమతులు, గుడ్ విల్, కనీస అద్దె సైతం లేకుండా రోజుకు లక్షల్లో వ్యాపారం చేసుకునే పూల వ్యాపారులకు కేటాయించారు. దీంతోపాటు కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులకు పరిగి బస్టాండ్‌లో సిండికేట్ ఫార్మా సొసైటీకి కేటాయించిన స్థలాన్ని కేటాయిస్తామని కౌన్సిల్ అనుమతి తీసుకున్నారు. అందులో సగం బస్టాండ్‌కు కేటాయించారు. ఈ నిర్ణయంతో బస్సులు నిలపడానికి స్థలం చాలక పోవడంతో పాటు బస్టాండ్‌ను నమ్ముకుని జీవనం చేస్తున్న ఎంతో మంది చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు.

పట్టణంలో శిథిలావస్థకు చేరిన మార్కెట్‌ను కూల్చి వేశారు. నిధులు లేకపోయినా గత ప్రభుత్వ హయాంలో రూ. 23 కోట్లతో నూతన మార్కెట్, వాణిజ్య సముదాయం నిర్మించారు. పనులు చివరి దశలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మున్సిపాల్టీకి సంపదను చేకూర్చే మార్కెట్‌ను ప్రస్తుత పాలకులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అధికార పార్టీ నాయకులు కొందరు మార్కెట్‌ను అడ్డుపెట్టుకుని భారీగా వెనుక వేసుకున్నారు. అది చాలదన్నట్లు టోకు కూరగాయల వ్యాపారులకు మార్కెట్లో స్థలాలు లేవని, వారికి స్థలాల కేటాయింపును సైతం నాయకులు తమకు ఆదాయ వనరుగా చేసుకున్నారు. టోకు వ్యాపారులకు మార్కెట్ సమీపంలోని ప్రయివేటు బస్టాండ్‌లో స్థలాలు కేటాయించాలని ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ గతంలో సిండికేట్ పార్మర్స్ సొసైటీకి కేటాయించిన స్థలం దుర్వినియోగం కావడంతో మున్సిపాల్టీ స్వాధీనం చేసుకుంది. ఈ స్థలాన్ని వ్యాపారులకు ఇవ్వాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. స్వాధీనం చేసుకున్న స్థలంతో పాటు బస్టాండ్‌లో మరింత స్థలాన్ని వ్యాపారులకు కట్టబెట్టారు. ఇందులో అధికార పార్టీలోని కొందరు వ్యాపారుల పేరిట స్థలాలు చేజిక్కించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థలాలను కేటాయించినందుకు నాయకులు, కౌన్సిలర్లు, అధికారులకు వ్యాపారులు పెద్దమొత్తం ముట్టచెప్పినట్లు సమాచారం. బస్టాండ్‌లోని స్థలం అంతా వ్యాపారులు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణానికి ఉపయోగించడంతో ప్రయివేటు బస్టాండు ప్రస్తుతం చిన్నదిగా మారింది. దీంతో బస్సులు, వాహనాలు నిలపడానికి ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్‌లో గతంలో మరుగుదొడ్లు నిర్మించిన స్థలాన్ని సైతం టోకు వ్యాపారులకు కేటాయించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి 25 ఏళ్ల లీజు పొందిన గుత్తేదారుడు లబోదిబోమంటున్నారు. తన పరిస్థితిని అధికారులు, అధికార పార్టీ నాయకులకు వివరించినా ఆయనకు న్యాయం జరగలేదు. ఈ అన్యాయంపై ఆయన కోర్టుకు వెళ్లడానికి సిద్ధమైనట్లు తెలిసింది. ఏది ఎమైనప్పటికీ పురపాలక సంఘానికి ఆదాయాన్ని చేకూర్చే వాణిజ్య సముదాయం నుంచి పురపాలక సంఘానికి ఆదాయం రాక పోయినప్పటికి పాలకులకు, అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది.

జగనన్న లేఅవుట్‌లో అక్రమాలు

సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొత్తచెరువు



విలేకరులతో మాట్లాడుతున్న ఇఎస్.వెంకటేష్

కొత్తచెరువు జగనన్న కాలనీలో పలు అక్రమాలు జరిగాయని, దీనిపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్, ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి డిమాండ్ చేశారు. మంగళవారం నాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్తచెరువులో జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం కోట్లు ఖర్చుపెట్టినా పేదవాళ్ల కల నెరవేరలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చే రుణాలు ఏమాత్రం సరిపోలేదన్నారు. కాలనీలో ఖాళీగా ఉన్న జాగాలను కొందరు దళారులు అనధికారికంగా ఆక్రమించుకుని అక్కడ పునాదులు వేసి రూ.రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇందులో అధికారులకు కూడా భారీ ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ ద్వారా వచ్చే బిల్లులు కూడా లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. హౌసింగ్ అధికారులకు ఎవరైతే అనుకూలంగా ఉంటారో అలాంటి వారికే బిల్లులు అందుతున్నాయని చెప్పారు. పేదలకు సంబంధించిన లేఅవుట్‌లో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం విచాకరం అన్నారు. తక్షనం వీటిపై విచారణ జరిపి అక్రమాలను వెలికి తీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట మండల కన్వీనర్ ముత్యాలు, కో కన్వీనర్ శ్రావణి, సభ్యులు పవన్, పెద్దన్న, రామాంజి పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా దసరా వేడుకలు



నూతన మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. విజయ దశమి పర్వదినం పురస్కరించుకుని సాయి కుల్వంత్ సభా మండపాన్ని రకరకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేశ విదేశీ భక్తులతో ప్రశాంత నిలయం కిటకిటలాడింది. దసరా పండుగ పురస్కరించుకొని విశ్వశాంతిని కాంక్షిస్తూ ఏటా నిర్వహించే వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఏడు రోజుల పాటు కొనసాగి మంగళవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. యజ్ఞం అనంతరం నదీ పుణ్య జలాలను రుత్వికులు భక్తులపై సంప్రోక్షించారు. సాయంత్రం సాయి కుల్వంత్ సభా మండపంలో భగవాన్ సత్యసాయి బాబా పూర్వపు ఉపన్యాసాన్ని తెరలపై ప్రదర్శించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, మహేష్ రాఘవన్ బృందం సంగీత గాన కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, సత్యసాయి యూనివర్సిటీ ఛాన్సలర్ చక్రవర్తి, నాగానంద్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మొబైల్ హాస్పిటల్ వ్యాన్ ప్రారంభించిన రత్నాకర్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగపడే మొబైల్ హాస్పిటల్ వాహనాన్ని సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ ప్రారంభించారు. గతంలో ఉన్న మొబైల్ ఆసుపత్రి వాహనానికి ఇది అదనంగా సమకూర్చారు. ఇందులో అధునాతన స్కానింగ్, ఎక్సరే, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే అత్యవసర రోగులకు పరీక్షలు నిర్వహించే విధంగా తీర్చిదిద్దారు.

వర్షాభావంతో ఎండిన వేరుశనగ

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-మడకశిర



పూర్తిగా ఎండిపోయిన వేరుశనగ పంట

ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో రైతులు ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేశారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి ఏమాత్రం చేతికందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఐదు మండలాల్లో పంట పూర్తిగా నష్టపోవడంతో విధిలేని పరిస్థితిలో రైతులు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏటా పంటలు సాగు చేసి నష్టాలు చవిచూస్తున్నామని, గత రెండేళ్లు వర్షాలు ఎక్కువగా కురవడంతో వేరుశనగ పంట చేతికందలేదని, ఈ ఏడాది చినుకు జాడే లేకపోవడంతో వేరుశనగ పంటను ఇప్పటికే తొలగించామని అన్నదాత లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఐదు మండలాల్లో 15,876 హెక్టార్లలో వేరుశనగ పంట సాగైంది. మడకశిర మండలంలో 1,846 హెక్టార్లు, రొళ్ల-4,002, గుడిబండ-4,600, అమరాపురం-2,170, అగళి మండలంలో 3,258 హెక్టార్లలో వేరుశనగ అష్టకష్టాలు పడి విత్తనం వేసినప్పటి నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయ. పంట చేతికొచ్చే సమయంలో కూడా వర్షం కురవకపోవడంతో పెట్టుబడి కూడా దక్కలేదని విధి లేని పరిస్థితిలో పంటను పశువులకు గ్రాసం కోసం తొలగిస్తున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేస్తే కొంతవరకూ ఉపశమనం కలుగుతుందని, లేనిపక్షంలో రైతులు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. కావున ప్రభుత్వం నష్టపరిహారంతో పాటు పంటల బీమా అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాల్మీకి జయంతి నిర్వహణకు ఏర్పాట్లు

పరిశీలించిన ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ రంగయ్య

ఈనెల 28వ తేదీన అనంతపురం నిర్వహించే రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంతి వేడుకలను ఎలాంటి సమస్యలు లేకుండా ఘనంగా నిర్వహించాలని ఎంపీ తలారి రంగయ్య అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దనున్న కెఎస్‌ఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమ నిర్వహణ కోసం స్థలాన్ని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లను త్వరగా అధికారులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున వాల్మీకులు హాజరు అవుతారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలూ కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సాంప్రదాయ బద్ధంగా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. కార్యక్రమం నిర్వహించే స్థలం వద్ద శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ పొగాకు రామచంద్ర, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారీ, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో జగనాసుర పోస్టర్లు దహనం


జగనాసుర పోస్టర్లను దహనం చేస్తున్న గుండుమల, తదితరులు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 'దేశం చేస్తుంది రావణుసుర దహనం.. మనం చేద్దాం జగనాసుర దహనం' అని ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో 'సైకో పోవాలి' అని రాసిన కాగితాలను దహనం వేశా రు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, రవికుమార్, తిమ్మరాజు, మార్కెట్ బాబు, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మల్లికార్జున, మంజు, రమేష్, రాజు, కరియన్న, బొమ్మయ్య గారి చంద్ర పాల్గొన్నారు.


జగనాసురుని పోస్టర్లను దహనం చేస్తున్న తెలుగుతమ్ముళ్లు

కొత్తచెరువు : జగనాసురుని అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగనాసురుని పోస్టర్లను దహనం చేసి 'సైకో పోవాలి సైకిల్ రావాలి' అని నినాదాలు చేశారు. రాబోయే ఎన్నిక ల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు నాగేంద్రప్రసాద్, బోయ రాజు, ఆలకుంట శ్రీనివాసులు, చంద్రమోహన్, సైకిల్ షాపు బాబా, ఐస్.వెంకటేష్, కేశప్ప, పెద్దన్న, రాధా, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు మద్దతుగా డిహెచ్‌పిఎస్ పాదయాత్ర

ప్రజాశక్తి-మడకశిర



చలో హైదరాబాద్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న దశ్యం

ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ అంశాలకు సంబంధించి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చేపట్టిన పాదయాత్రకు దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని ఎఆర్. గౌరీపురం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం కూడలిలో 'విశ్వరూప మహాసభ' కరపత్రాలను పంపిణీ చేశారు. హనుమంతు మాట్లాడుతూ మందకృష్ణ పాదయాత్రకు మద్దతుగా డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. మందకృష్ణ మాదిగ జాతి భవిష్యత్తు కోసం ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణకు ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో చేపట్టిన విశ్వరూప మహాసభకు ప్రతి మాదిగ హాజరై జయప్రదం చేయాలని కోరారు. పాదయాత్రలో డిహెచ్‌పిఎస్ తాలూకా అధ్యక్షుడు పిఎన్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు రామాంజనే యులు, సీనియర్ నాయకుడు ఎం.శివప్ప, తాలూకా ఇన్‌ఛార్జి మారుతి, రామకృష్ణ, గోవిందు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కొండమ రాజు

మండల పరిధిలోని నిడిమామిడి, పెడపల్లి, మార్లపల్లి గ్రామాల్లో మంగళవారం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొండమరాజు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ముందుగా మున్సిపాలిటీ పరిధిలోని 180 మంది మున్సిపల్ కార్మికులు, రిక్షా కార్మికులకు, మార్లపల్లి గ్రామంలో 150 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశా రు. నిడిమామిడి గ్రామంలో స్వచ్ఛభారత్ సిబ్బందికి, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందజేశారు. పెడపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్, పంచాయతీ సిబ్బందికి అందజేశారు. బ్యాళ్లు, నూనె, 5 కిలోల గోధుమపిండి, ఉప్మా రవ్వ, సబ్బులు, తదితర రూ. 1500 విలువ చేసే 15 రకాల వస్తువులతో కూడిన బ్యాగును ఇంటింటికీ అందజేశారు. మార్లపల్లి గ్రామస్తులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామస్తులు కొండమ రాజుకు ఘనంగా స్వాగతం పలికి ఊరేగించారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బాలగంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి రాజారెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, గ్రామీణ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మహానంద, చంద్రమోహన్, చెన్నకేశవరెడ్డి, హరి, శివనాయక్, మురళినాయక్, నిడిమామిడి, పెడపల్లి, మార్లపల్లి, గువ్వలగుట్టపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు .

సిఎన్‌ఎ ర్యాంకర్‌కు ఎన్‌ఆర్‌ఐ చేయూత

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


శ్రీకాంత్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న జనార్ధన్

మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన మండ్లి శ్రీకాంత్ సిఎన్‌ఎలో ఆల్ ఇండియా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. శ్రీకాంత్‌కి యూఎస్‌ఎలో ఉన్న ధర్మవరం పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు హరిప్రసాద్, ప్రసాద్ రూ. 40వేలు అందజేశాడు. ఆ మొత్తాన్ని మంగళవారం హరిప్రసాద్ బంధువు కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన జనార్ధన్ శ్రీకాంత్ ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం జనార్ధన్ ఎన్‌ఆర్‌ఐలతో వీడియో కాల్ ద్వారా మాట్లాడించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో తమ వంతుగా సాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటామని ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామ్మో హన్, శ్రీకాంత్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

దసరా పండుగ సందర్భంగా పట్టణం లోని 17వ వార్డు కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర మున్సిపాలిటీలో పని చేసే 40 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వల్లే పట్టణం లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ ఆనందంగా పండుగలు జరుపుకుంటున్నారన్నారు. పట్టణ ప్రజలు మున్సి పల్ కార్మికులను సొంతింటి మనుషుల్లా భావించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

26న 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని ఈదుల ముష్టూరు గ్రామంలో గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సాయిమనోహర్, సర్పంచి చెడిపోతుల గోపాల్, ఎంపిటిసి రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు విలేజ్ క్లినిక్ ఆవరణలో వైద్యాధికారులు, సిబ్బంది వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం


ప్రజాశక్తి-నల్లమాడ

రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్థానిక రైతు సంఘం నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు మాట్లాడారు. రైతులు శ్రమటోడ్చి పంటలు పండిస్తే వాటిని అమ్ముకోవడానికి మార్కెట్ సదుపాయం లేక దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక రైతులు పూర్తిగా పంటలు నష్టపో యారన్నారు. బోరు బావుల కింద సాగు చేసిన వరి, కూరగాయల పంటలు సైతం విద్యుత్ సమస్యలతో చేతికందడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. పల్లెల్లో మూగజీవులు, పశువులను సైతం అమ్ముకొని పట్టణాలకు వలస వెళ్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సాయిప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన టిఎస్. సాయిప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రపంచ మహాసభ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ నియామక పత్రం పంపగా రాష్ట్ర మహాసభ రాజకీయ విభాగం ఛైర్మన్ కోటా సత్యం పుట్టపర్తిలో సాయిప్రసాద్‌కి నియామకపత్రం అందజేశారు. కోటా సత్యం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాఖల ద్వారా నిరుపేద ఆర్యవైశ్యులు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. సంఘ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సాయిప్రసాద్‌ను మహాసభ ఎంపిక చేసిందన్నారు. సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు.


నియామక పత్రం అందిస్తున్న కోటా సత్యం


క్రీడాకారులతో న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, ఎం.శ్రీధర్

క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ గుర్తింపు

న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, ఎం. శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం


విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, తెలంగాణ నాంపల్లి మెట్రో పాలిటన్ జడ్జి డి.దుర్గా ప్రసాద్ సూచించారు. హిందూపురం క్రికెట్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంజిఎం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణిస్తే జాతీయ స్థాయి వరకు గుర్తింపు వస్తుందని, అదే క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆర్‌డిటి సంస్థ ఫుట్‌బాల్, క్రికెట్ క్రీడాకారులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామ న్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్, పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, పిడిలు సురేష్, విలియమ్స్, అన్సార్‌ఖాన్, న్యాయవాది మురళి, తదితరులు పాల్గొన్నారు.


గుండుమల తిప్పే స్వామిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

'గుండుమల'కు తెలుగుతమ్ముళ్ల సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిని ఇటీవల విజయవాడలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అభినందించారు. దీంతో మంగ ళవారం పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో గుండుమలను తెలుగుతమ్ముళ్లు ఘనంగా సన్మానించా రు. నియోజకవర్గంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరసనలు, చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, ఓటరు వెరిఫికేషన్, ఇదేం ఖర్మ రాష్ట్రానికి, విలేజ్ మ్యాపింగ్, తదితర అంశాల్లో నియోజకవర్గం రాష్ట్రస్థాయిలోనే ద్వితీయ స్థానంలో ఉండడంతో లోకేష్, అచ్చెన్నాయుడు గుండుమల తిప్పేస్వామిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్‌సాబ్, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య చౌదరి, అధ్యక్షుడు తిమ్మరాజు, రవికుమార్, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సామకోటి ఆది

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దసరా పండుగ సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో 28 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి స్ఫూర్తితో సేవా మార్గంలో నడుస్తూ తన వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాల్లో పనిచేస్తున్న కార్మికులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దయ్యాల ఉమాపతి, పేపర్ గంగాధర్, శంకర్, లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ కృష్ణవేణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో జూలప్ప, తదితరులు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మడకశిర

గుడిబండ మండల పరిధిలోని సిసి గిరి గ్రామంలో వైసిపికి చెందిన జూలప్ప రాజీనామా చేసి మంగళ వారం పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పార్టీలో చేరాడు. అతడితో పాటు 5 కుటుంబాలు టిడిపిలో చేరగా గుండుమల సాదరంగా ఆహ్వా నించి పసుపు కండువా వేశారు. అనంతరం బైరేపల్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఆహ్వానం మేరకు యూపి విసి విండో ఫ్యాక్టరీలో ఆయుధ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి జికె.ఈరన్న, హనుమంతరాయప్ప, రంగనాథ్, శంకర్, జులప్ప, పండప్ప, తిప్పన్న, సిద్దేష్, ఎంజేరప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల గృహ నిర్బంధం దారుణం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జగనాసుర కార్యక్రమాన్ని అడ్డుకోవ డంలో భాగంగా పోలీసులు ఆ పార్టీ మండల నాయకులను గృహ నిర్బంధం చేయడం దారుణమని సిపిఐ మం డల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు విమర్శించారు. ముదిగుబ్బలో శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ 'సైకో సిఎం పోవాలి' పోస్టర్లను దహనం చేసేందుకు టిడిపి ఆధ్వర్యంలో 'జగనాసుర' కార్యక్రమం చేపట్టగా పోలీసులు టిడిపి నాయకులను సోమవారం సాయంత్రమే హౌస్ అరెస్టు చేయడం అమానుషమని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలను భయపెట్టి, హింసిస్తూ, అక్రమంగా అరెస్ట్ చేస్తూ రాబోయే ఎన్నికల్లో వారిని పాల్గొనకుండా చేయడానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం నిరంకుశ ధోరణిని వీడి పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

నేరాలు ఘోరాలు

అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

తెగిన వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం


మృతి చెందిన వెంకట శివయ్య

రోడ్డు రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. వివరాలు.. కర్నాటకలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటశివయ్య(33) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పోచనపల్లి మీదుగా హిందూపురం బయల్దేరాడు. ఈ మార్గంలో పెన్నా నదిపై ఉన్న బ్రిడ్జి ఏడాది క్రితం భారీ వర్షాలకు తెగిపోగా అధికారులు తాత్కాలికం గా ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోగా ప్రస్తుతం రాక పోకలు పెన్నా నదిలో నుంచి జరుగుతున్నాయి. ఈ విషయం తెలియని వెంకటశివయ్య పెన్నా నది వంతెనపై నుంచి వేగంగా వచ్చి కిందకు పడిపోవడంతో తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళు న్న వారు గుర్తించి సమాచారం ఇవ్వగా టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా అసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదం అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెగిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వాపుతున్నారు. ఈ వంతెన మీదుగా కర్నాటక సరిహద్దు గ్రామాలతో పాటు పోచనపల్లి, ఉడుగులపల్లి, సంజీవరాయునిపల్లి, బేవానహళ్లి, నక్కలపల్లి గ్రామల ప్రజలు హిందూపురం పట్టణానికి రావాల్సి ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని నల్లబోయనపల్లి ఇసుక రీచ్ సమీపంలో డి.చెర్లోపల్లి పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 37 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేకాట ఆడుతున్నట్లు సోమవారం సమాచారం అందడంతో హుటాహుటిన సిబ్బందితో వెళ్లి జూదరులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


సోమశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్థసారథి

బాధిత కుటుంబానికి 'బికె' పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ చిన్న కుమారుడు గతవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి పుల్లేరు గ్రామంలోని వారింటికి వెళ్లి సోమశేఖర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు మండల పరిధిలోని తిప్పరాజుపల్లి గ్రామానికి చెందిన శీనానాయక్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బికె పార్థసారథి హాజరయ్యారు. ఆయన వెంట నాయకులు దేవా నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, అజంతుల్లా, బెల్లాలచెరువు చంద్ర, వెంకటరెడ్డి, ఫిరోజ్‌ఖాన్, మనోహర్, బొబ్బిలి రామ్మోహన్, మనిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


డికె బాబుని సన్మానిస్తున్న ఆర్యవైశ్య కమిటీ సభ్యులు

డికె బాబుకి సన్మానం

ప్రజాశక్తి-తలుపుల

విజయదశమి పండుగ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి చింతకుంట కృష్ణారెడ్డి(డికె బాబు)ని కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువాతో సత్కరించారు. గతంలో ఆర్యవైశ్యుల కోరిక మేరకు డికె బాబు రూ. 20 లక్షలు ఖర్చు చేసి ఆర్యవైశ్య శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించారు. ఎగువ పేట సమీపంలో వెలసిన ఏటి గంగమ్మ ఆలయం వద్ద రూ. 25 లక్షల వ్యయంతో షెడ్లు ఏర్పాటు చేయించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు వేయించారు. విద్య, వైద్యం కోసం ఎందరికో ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్, ఎంపిపి మహమ్మద్ రఫీనాయక్, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు శ్రీరాములయ్యశెట్టి, ఘంటసాల ఉమాపతి, జి.రామకృష్ణ, నామ కిట్టు, అశోక్, ప్రసాద్, రోహిత్, కుబేర్, రాజు, సునీల్, చరణ్, హనుమంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విజయ దశమి సందర్భంగా లలిత మహేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం అమ్మవారు గుడి ఎదురుగా హోమం నిర్వహించారు. ఇందులో కప్పలబండ, మామిళ్లకుంట క్రాస్, గుంటిపల్లి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మామిళ్లకుంట క్రాస్‌లోని శ్రీసాయి అమృత ఆస్ట్రాలజీ యోగా ట్రస్ట్ నిర్వాహకులు వర్మస్వామీజీ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లె మాట్లాడుతూ విజయదశమి పర్వదినాన మహిళలకు చీరలు పంపిణీ చేసిన వర్మ గురూజీని అభినందించారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ


ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విదేశీయురాలు క్రిస్టినా నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి దాతృత్వం చాటుకుంది. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న 150 కుటుంబాలకు మంగళవారం ఆమె 10 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. క్రిస్టినా ఏటా హాలెండ్ నుంచి పుట్టపర్తికి వచ్చి సత్యసాయి మహాసమాధిని దర్శించు కుని కొద్ది రోజుల పాటు ఇక్కడే ఉంటారు. ఆమె మాట్లాడుతూ సత్యసాయి సేవా స్ఫూర్తితో తన వంతుగా దసరా సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశానని తెలిపారు.


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న విదేశీ మహిళ క్రిస్టినా

ఘనంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

ప్రజాశక్తి-ముదిగుబ్బ


ముదిగుబ్బలో ప్రత్యేక అలంకరణలో కన్యాకా పరమవేశ్వరీ మాత, కొత్తచెరువులో కొలువుదీరిన అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మంగళవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలో పాల్గొనగా కేరళ వాయిద్యంతో అమ్మవారిశాల నుంచి కదిరి పెట్రోల్ బంక్ వరకూ జాతీయ రహదారి పొడవు నా గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య భక్తులు దారి పొడవునా భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అర్చకులు రవితేజ, జయప్రకాశ్ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదానికి దాత మేడా కళ్యాణ్ కుమార్ 15 బియ్యం ప్యాకెట్లు ఇచ్చారు. కార్యక్రమంలో క్రిష్ణం సూర్యనారా యణ, యువజన సంఘం మహేష్‌కుమార్, నాగరాజు, రత్నం, శ్రీధర్, మహిళలు జయశ్రీ, సునీత, మాధవి, మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలో దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. అయితే పండుగ చేసుకునే విషయం లో ఒకింత అయోమయం, గందరగోళం నెలకొంది. కొందరు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు దశమి గడియలు వచ్చిన తర్వాత చేసుకోగా, మరికొందరు మంగళవారం చేసుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. బత్తలపల్లిలోని లలిత త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరి ఆలయం, దుర్గమ్మ గుడి, కొల్లాపురం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాల అలంకరణతో ఏర్పాటుచేసిన దుర్గామాతను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా విజయ దశమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా పెద్దమ్మ, కొత్తచెరువు అమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించా రు. పండుగ రోజు ఆలయాలు భక్తుల కిక్కిరిసాయి. పెద్దమ్మ అమ్మవారిని పల్లకిలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయం వద్ద దుర్గ హోమం నిర్వహించారు.